# వ్యత్యాసాలు

శ్రీనివాసులు లోకాన్ని చూడదల్చాడు.

కన్నెత్తి మరీ చూడ దల్చాడు. లోకంలో నీత్యవినీతుల్ని. న్యాయాన్యాయాల్ని చూడదల్చాడు. చూశాక వూరుకుంటాడా? వాటినన్నింటినీ అవగాహన చేసుకోదలచాడు.

బయలుదేరాడు షికారు. వీధిలోకి ఒంటరిగానే బయలుదేరాడు. ప్రక్క నెవర్నయినా స్నేహితులను ఉంచుకుంటే తన కార్యాచరణకి భంగం. అంచేత ఏకాకిగానే బయలుదేరాడు.

భానువారం కావడంవల్ల సంతలో అసంఖ్యాక జనం.

"ఓయ్ నాయుడూ!" అన్నాడు పోలీసు.

"ఏం బాబూ!"

"చేసిన పని తప్పై వుండగా ఇంకా తిరిగీ ఏం బాబూ! అంటావా?" గదమాయించాడు పోలీసు.

"ఏమిటి బాబూ తప్పుచేశాను?"

"రోడ్డుకి కుడిప్రక్క నడవమంటే ఎడమ ప్రక్కెందుకు నడిచావ్? నీ పేరు చెప్పు!"

"నాకు తెల్దుబాబూ! ఈ సారికి మన్నించండీ!"

"అదేం పనికిరాదు. ముందు పేరు చెప్పు!"

"బాబ్బాబూ! ఇదిగో......... తమకి....... ఇడిచి పెట్టండి బాబయ్యా!"

పోలీసు నల్దెసలా చూసి, ఎవరూ చూడకుండా, చాటుగా వెనక్కి చేతులు చాచాడు. చేతులో నాల్గణాలుపడ్డాయి. పైగా - "జాగ్రత్త! తెలీదన్నావు కాబట్టి ఈసారికి క్షమించాను. మరెప్పుడూ ఇలా చెయ్యకు. వెళ్లు!..." కసిరాడు.

శ్రీనివాసులు యిదంతా చూచాడు. కళ్ళెర్రజేశాడు. "ఛా!" అనుకున్నాడు. ఇంత ఘోరమా? నేనే అయితే ఈ 444 ని అకస్మాత్తుగా డిస్మిస్ చేసి పారెద్దును! అనుకున్నాడు.

శ్రీనివాసులు పురోగమనం సాగించాడు.

నడచినడచి మార్కెట్టులోకి చేరుకున్నాడు.

కొన్ని పాకలు చూశాడక్కడ అందులోంచి జనం వేర్వేరుగా వస్తున్నారు. అదైనా తిన్నగావస్తున్నారా? తూలుతూ వస్తున్నారు.

"హుఁ!" అని చిరునవ్వు నవ్వాడు శ్రీనివాసులు - "వెధవ ప్రభుత్వం! తను చెడీ ప్రజల్ని చెడిపింది. నిషేధం తీసిపారేయరాదూ? తెలివి తక్కువ గాని! మద్యపాన నిషేధంట! వెధవన్నర వెధవలు!

-మళ్లీ చూస్తే ఈ నిషేధంవల్ల సంవత్సరానికి నష్టం ఎనిమిది కోట్లుట. అయినా ప్రజలు త్రాగడం మానలేదు. వాళ్లని ప్రభుత్వం అదుపాజ్ఞల్లో వుంచలేకపోతూంది. వాళ్ల మానాన్ని వాళ్లు హెచ్చుధరలకి కొనుక్కుని డబ్బు తగలెట్టి ఇల్లు గుల్ల జేసుకుంటున్నారు. ఇవతల ప్రభుత్వంవారు చూస్తే ఎనిమిది కోట్లు నష్టపోతున్నారు.

-ఆమాత్రం దానికి నిషేధం ఎందుకూ అంటా? అనుకున్నాడు శ్రీనివాసులు. తనే అయితే ఇలా వాడ వాడలా తిరిగీ, త్రాగుబోతుల్ని పట్టుకుని ఖైదులో పడేసి, జరిమానాల విధించైనా, ప్రభుత్వానికి లాభం కలిగించే వాడిని కదా అనుకున్నాడు పైగా-

ఛా ఛా ఛా! ఇన్ని ఘోరాలా? ఎన్ని ఘోరాలో? ఇంకెన్ని అన్యాయాలో? ఇంకెంతని ఇలా చూడ్డం యీ అన్యాయాల్ని? ఎందుకిలా అనవసరంగా బాధపడ్డం? పోనీ వీళ్లని పట్టుకునే అధికారమైనా వుంటే.... అనుకున్నాడు శ్రీనివాసులు.

పురోగమనం సాగించాడు.

సాయంత్రం ఆరుగంటలు కావడం చేత, ఓసారలా నాలుగు రోడ్ల కూడలివద్దకి వెళ్ళాడు. "పేపర్ సార్!" అని అరిచాడుపేపర్లమ్మే అబ్బాయి.

శ్రీనివాసులు అకస్మాత్తుగా జేబు తడుముకున్నాడు. ప్రొద్దుటి మూడణాల్లో ఒకణా బీడీలు కొనుక్కోగా, ఇంక రెండణాలున్నాయి.

పేపరంతా ముందునుంచి వెనక వరకు తిరగేసి చూశాడు శ్రీనివాసులు. ఛా! ఒక్కటీ లేదు తనకు పనికొచ్చే విషయం. అన్నీపనికిరాని వార్తలే1

"వెధవ పేపరు!" సణుక్కున్నాడు శ్రీనివాసులు.

ఓ దగ్గర నెహ్రూగారి ఏ దేశ ప్రయాణం గూర్చో వుంది. నెహ్రూ ఎక్కడికో వెళితే తనకేం? మరో దగ్గర తేలుకాటు మందు గురించి ప్రకటన మరోచోట వైజయంతిమాల వాడే లక్సుసోప్ గురించి ప్రకటన. ఓ దగ్గర సంవత్సర ఫలితాలు ఎవరో ఋషీశ్వరుడు చెప్పాడని వుంది. ఇంకోచోట నేషనల్ సేవింగ్స్సర్టిఫికెట్లు కొనమని, అసలే డబ్బులేకుండా ఛస్తూంటే ఇదో బాధ? మరో రెండుపూర్తి పేజీలు నిండా రెండు క్రొత్త సినిమాలు విడుదలవుతున్నాయని ప్రకటనలు.

అబ్బబ్బ! అంతా హంబగ్! రెండణాలూ దండగ! వెధవ పత్రిక.

అనుకోకుండా శ్రీనివాసుల్కి వారఫలాలు మాత్రం కనబడ్డాయి. అతనికి వాటిపై నమ్మకం లేకపోయినా చదివేసుకున్నాడు.

-ఇవోటి వెధవ ఫలితాలు! ధన లాభం అంటాడు, తొక్కంటాడు, తోలంటాడు.

ఒక్కటీ నిజం లేదు. చదివినవాళ్లంతా "మనకి రైటుగా జరక్కపోయినా. ఈనక్షత్రంగల మరో వ్యక్తికి జరిగివుంటుంది." అను కుంటారు అమాయకులు.

ఓ మూల నేదో క్రొత్త ప్రకటన చూశాడు శ్రీనివాసులు. చదివి అది సబిన్స్పెక్టర్ పోస్టుకి సెలక్షన్ అని తెలుసుకున్నాడు.

చదువు స్కూల్ ఫైనల్ పోయినా చాలుట. మనిషికాస్త దృఢంగా ఉంటే చాలట. భేష్! యింకేం? శ్రీనివాసులు రెంటికీ తగివున్నాడు. "ఓ అప్లికేషన్ విసిరిచూద్దాం! ఏమో, ఏ పుట్టలో ఏ పాముందో!" అనుకున్నాడు శ్రీనివాసులు. వీళ్ల సెలక్షన్ కయ్యే ఖర్చులు కూడా ప్రభుత్వమే భరించుకుంటుందట. "ఇది మరీ బావుంది." అనుకున్నాడు శ్రీనివాసులు.

అనుకున్నంతపనీ చేశాడు. సెలక్షన్కి వెళ్లి సెలక్టయ్యాడు కూడా-

శ్రీనివాసులు ట్రెయినింగ్ వగైరా లన్నీ పూర్తయి, మొత్తానికేదో అదృష్టవశాత్తూ స్వగ్రామానికే పోలీసు సబ్ ఇన్స్పెక్టరుగా పంపబడ్డాడు.

⊗ ⊗ ⊗

శ్రీనివాసులు నాలుగు రోడ్ల కూడలివద్ద హఠాత్తుగా మోటరు సైకిల్ ఆపాడు. నిఘాతో పోలీసుకి అవుపించకుండా, తనుమాత్రం పోలీసుని చూశాడు. పోలీసు ఎనిమిదణాలు జేబులో వేసుకుని నేరస్తుణ్ణి విడిచి పెట్టాడు.

శ్రీనివాసుల్కి అకస్మాత్తుగా పురాస్మృతి కలిగింది. తను ఓ రోజు చూచిన ఇటువంటి దృశ్యమే. తను ఈ **444** ని డిస్మిస్ చేద్దామనుకున్నాడప్పుడు ఇప్పుడు మళ్లీ ఈ నేరం చేసినవాడు ఆ **444** రే!

శ్రీనివాసులు వెంటనే జిల్లా సూపర్నెంటుకి రిపోర్టువ్రాసి **444** ని సస్పెండ్ చేయించగలిగాడు!

శ్రీనివాసులు తన ఘనకార్యానికి తాను మెచ్చుకొని "ఇప్పటితో మిగతా వాళ్లకు బుద్ధొస్తుంది!" అని కొత్తగా పెంచిన కోరమీసాల్ని పైకి ఎగదువ్వాడు.

పురోగమనం సాగించాడు.

శ్రీనివాసులు మోటారు సైకిల్ను ఆఫీసులో పడేసి కాలినడకని బయలు దేరాడు మార్కెట్టులోకి. తను ఒకప్పుడు చూసి చికాకుపడ్డ రెండోదృశ్యం మళ్ళీ చూశాడు. కల్లు పాకల్లోంచి త్రాగుబోతులు తూలుతూ, చెల్లాచెదరైపోతున్నారు. ప్రక్కనున్న కాన్స్టేబుల్స్కి ఆర్డరిచ్చాడు వాళ్లు వెంటనే త్రాగుబోతుల్ని పట్టుకుని ఈడ్చుకుపోయారు.

శ్రీనివాసులు త్రాగుబోతుల్ని కోర్టులో నించోబెట్టి, ముప్ఫై రూపాయలు చొప్పున జరిమానా విధింపజేశాడు. ప్రభుత్వానికి శ్రీనివాసులువల్ల నాలుగు వందల రూపాయలు దాకా ముట్టాయి. "వీళ్ల సంకటం కుదిరింది!" గర్వించాడు శ్రీనివాసులు.

ఇప్పుడు శ్రీనివాసులుగారికి ప్రమోషన్ వచ్చింది. అతని సాహస కృత్యాలకు ప్రభుత్వం మెచ్చుకొని అతనికి సర్కిల్ ఇన్స్పెక్టర్ ఉద్యోగం బహూకరించింది.

శ్రీనివాసులు ఆఫీసులో కూర్చుని వుండగా ఒక పోలీసు వచ్చి బ్రహ్మాండమైన వార్త చెప్పాడు.

ఏమిటంటే ఎవరో మిల్లు యజమాని ఏవో నల్లబజారు వ్యాపారాలు చేస్తోనే వున్నాడట. శ్రీనివాసులు త్వరగా బయల్దేరాడు, ప్రక్కని కొంతమంది అనుచరుల్ని వెంటబెట్టుకుని.

మిల్లు యజమాని శ్రీనివాసులుకి చెయ్యాల్సిన మర్యాదలన్నీ చేశాడు. కాని, శ్రీనివాసులు ఈ మాత్రానికే లొంగే ఘటం కాదు. అరెస్టు వారంటు చూపాడు.

మిల్లు యజమాని భయపడ్డాడు. చీకటి కోణంలోకి శ్రీనివాసులుని తీసికెళ్లి రెండువేల రూపాయలు నోట్లు తీసి చూపెట్టాడు.

వెంటనే శ్రీనివాసులు భయపడి పోయాడు! నోట మాటలేదు.

'రెండువేల రూపాయలు! అబ్బ! నా జీతమెంత? రెండు వందలు. అదైనా నెల్లాళ్ళు కష్టపడి పనిచేస్తేనే! ఇప్పుడో ? ఈ క్షణంలో పదిమాసాలు కష్టపడి పనిచేసినంత జీతం ! ఒక్క క్షణంలో -"పరమేశ్వరా1 ఎంత కరుణాకలిత హృదయుడివి!"అనుకున్నాడు.

శ్రీనివాసులు డబ్బుతో తిరోగమనం సాగించాడు.

ఇప్పుడు శ్రీనివాసులు రెండు చేతులా ఆర్జిస్తూ లక్షాధికారి అయ్యాడు.

శ్రీనివాసులు చీకటికోణంలో జరిగే మోసాల్ని రచ్చకీడ్వబోయి, తనే చీకటి కోణంలో చిక్కు బడ్డాడు!

29-8-1952

ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక